### ఎప్పుడు అడిగినా ప్రాసెస్‌లో ఉందంటున్నారు..



మా ఇంట్లో ఇద్దరి పేర్లతో పంట రుణాలు తీసుకున్నాం. ప్రస్తుతం మొత్తం రూ.3.10 లక్షల అప్పు ఉంది. మూడో విడత నుంచి కెనరా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను. ఇంత వరకు సరైన సమాధానం చెప్పడం లేదు.. ఎప్పుడు మాఫీ వస్తదని అడగిన ప్రతిసారి ప్రాసెస్‌లో ఉంది.. తప్పకుండా వస్తుందంటున్నారు. అసలు రూ.2 లక్షలు పైబడిన వారికి రుణమాఫీ వస్తుందా.. రాదా.. తేల్చి చెబితే బాగుంటుంది. మొదట్లో రూ.2 లక్షల వరకు ప్రభుత్వం మాఫీ చేస్తది.. మిగిలిన సొమ్ము మీరే కట్టాలి అని చెప్పారు. కానీ.. ఇప్పుడు ఎవరు ఏమీ చెప్పడం లేదు.

**– గోకినపల్లి ప్రసాద్, రైతు, మంగళగూడెం, ఖమ్మంరూరల్, ఖమ్మం జిల్లా**

# గురుకులాల్లో పరిశుభ్రత పాటించాలి

- విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దు..
- కళాశాలలను సందర్శించిన రాష్ట్ర బీఆర్‌ఎస్వీ బృందం




వంటశాలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌ఎన్ రాజు అన్నారు. బుధవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలను బీఆర్‌ఎస్వీ బృందం సందర్శించింది. తొలుత గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో వంట గది, వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటశాలలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. గురుకులానికి కాంపౌండ్ వాల్ లేకపోవడం, తరగతి గదుల భవన నిర్మాణం నిలిచిపోవడం గమనించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో కాంపౌండ్ వాల్, తరగతి గదుల భవన నిర్మాణం కోసం రూ.5 కోట్లు కేటాయించడంతో పనులు చేపట్టారని, ఇప్పుడు బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయాలను తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులను విడుదల చేసి వెంటనే భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలను సందర్శించేందుకు వెళ్లగా అనుమతి లేనిది లోనికి రావొద్దని ప్రిన్సిపాల్ అడ్డుకున్నారు. బృందం సభ్యులు పట్టుపట్టడంతో గురుకులంలోకి అనుమతి ఇచ్చారు. ప్రిన్సిపాల్‌తో కలిసి బృందం సభ్యులు వంటశాల, వంటలు, సరుకుల నిల్వలు, డార్మెటరీ గదులను పరిశీలించారు. వంటశాల వద్ద గోడ బయట ఆహార పదార్థాల వ్యర్థాలు, భోజనశాలలో కుక్కపిల్ల, అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు, ప్రాంగణంలో పెరిగిన చెట్లను వారు గమనించారు. ఇటీవల గురుకులంలో విద్యార్థులు మద్యం సేవించినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయిన విషయంపై ఆరా తీశారు. ఆ వీడియో పాతది అని, ఆ విద్యార్థులపై చర్యలు తీసుకున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సింధు తపస్వీ, వేముల హరీష్, పవన్‌నాయక్, రాహుల్ గౌడ్, శ్రావణ్‌కుమార్, సున్నం ప్రసాద్, సుభాని, పుష్ప, వినయ్, శేఖర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పెట్టుబడి ఎట్లా?

## పాత రుణాలు తీరలేదు.. కొత్త రుణాలు అందలేదు



- కాంగ్రెస్ నమ్మించి మోసం చేయడంతో పాలుపోని స్థితిలో రైతన్నలు
- చివరి విడత రుణమాఫీ ఉంటుందని అధికారులు దాటవేత
- స్పష్టత కోసం బ్యాంకులు, సొసైటీల చుట్టూ రైతుల చక్కర్లు
- యాసంగి సాగుకు ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

ఖమ్మం, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పంట పొలాలను బీడులుగా పెడితే ఓ తంటా, సరే అని సాగు చేద్దామంటే పెట్టుబడి దొరకక అవస్థలు.. ఇలా యాసంగి సాగుపై అన్నదాతలు రకరకాల ఆలోచనలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సగానికి సగంమంది రైతులకు కూడా రుణమాఫీ చేయకపోవడంతో పాత రుణాలు పెండింగ్‌లోనే ఉండగా.. కొత్తగా పంట రుణాలు తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నమ్మి ఓటేసిన రైతన్నలు నిండా మునిగారు. ఇప్పటికే వానకాలం సీజన్ ముగిసింది. యాసంగి సాగులో చాలామంది రైతులు మక్క, వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా వరినారు మళ్లు సైతం పోశారు. అయితే పొలాలను దమ్ము చేసుకుంది మొదలు ఎరువుల కొనుగోళ్లు, పంట పొలాలు దమ్ము చేయడం, కూలీలకు సొమ్ము చెల్లించడం ఇలా ప్రతి పనికి చేతినిండా డబ్బు ఉంటేనే తప్ప ముందుకు సాగలేని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వానకాలం, యాసంగికి సంబంధించిన రైతు భరోసా(పంటల పెట్టుబడి సాయం) అందలేదు. రుణమాఫీ కాని వారికి కొత్తగా బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడం లేదు.. ఫలితంగా సాగే ప్రశ్నార్థకంగా మారింది. ఈ వానకాలం సీజన్‌లో అతివృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులు యాసంగిలోనైనా ఆ లోటు పూడ్చుకునేందుకు సన్నద్ధమయ్యారు. వరుసగా నాలుగు విడతల రుణమాఫీ ప్రక్రియ ముగిసినప్పటికీ వివిధ కారణాల వల్ల రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న కొందరు రైతులకు ఈ నాలుగు విడతల్లోనూ మొండిచేయి కనబడింది. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు ఎడిట్ ఆప్షన్‌ను లైట్ తీసుకున్నారా.. లేదా ప్రభుత్వమే అర్హత ఉన్నా అందరు రైతులకు రుణమాఫీ చేయలేదా.. అన్నది ప్రతి ఒక్కరిలో మెదులుతున్న ప్రశ్న. దీంతో రెండురోజుల నుంచి సదరు రైతులు ఖమ్మం నగరంతోపాటు ఆయా మండల కేంద్రాల్లో ఉన్న సొసైటీలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### స్పష్టత కోసం అన్నదాతల అగచాట్లు..

నాల్గో విడత రుణమాఫీ ప్రకటన అనంతరం వరుసగా రెండురోజులు బ్యాంకులకు సెలవులు వచ్చాయి. దీంతో సోమవారం నుంచి ఆయా గ్రామాలకు చెందిన రైతులు నాల్గో విడతలోనైనా తమ పేర్లు వచ్చాయా? తమకు రుణమాఫీ జరిగిందా? అనే విషయాలపై బ్యాంకులు, సొసైటీల వద్ద ఆరా తీస్తున్నారు. నేరుగా వ్యవసాయ శాఖ అధికారులతోపాటు బ్యాంకులు, సొసైటీల్లో బారులు తీరుతున్నారు. సహకార సంఘాల్లో మాత్రం నాల్గో విడతకు సంబంధించిన జాబితా మంగళవారం మధ్యాహ్నం వరకు సైతం బ్యాంకుల నుంచి అధికారికంగా రాకపోవడంతో రైతులకు ఏమి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, అకౌంట్ నెంబర్లలో పొరపొచ్చాలు వచ్చిన రైతులకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేసి ఎడిట్ చేసినప్పటికీ అనేక మంది రైతులకు ఎడిట్ కాలేదు. దీంతో సదరు రైతులకు సమాధానాలు ఏమి చెప్పాలో వ్యవసాయ శాఖ అధికారులు తేల్చి చెప్పలేకపోతున్నారు. వీరికితోడు రూ.2 లక్షలకు పైబడిన అనేక మంది రైతులు బ్యాంకు సిబ్బంది చెప్పిన ప్రకారంగా రూ.2 లక్షలకు పైబడిన సొమ్ము చెల్లించినా తమకు ఎందుకు మాఫీ కాలేదని అధికారులను ప్రశ్నించడంతో మరో జాబితా ఉంటుందనే సమాధానం తప్ప.. ఎప్పుడు, ఎవరికి వర్తిస్తుందని చెప్పలేకపోతున్నారు. మొత్తంగా పెండింగ్ రుణమాఫీ రైతులు, రూ.2 లక్షలకు పైబడిన రైతుల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

### పంట పెట్టుబడికి డబ్బులు లేవు..



నాకు బేతంపూడి సొసైటీలో రూ.1.30 లక్షల అప్పు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్లుగా రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తే.. నా రుణం మాఫీ అవుతుందని అనుకున్నా. నాలుగు విడతల్లో రుణమాఫీ చేసినా.. నా రుణం మాత్రం మాఫీ కాలేదు. పంట పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఏటా రైతుబంధు డబ్బులు పడేవి. ఇప్పుడు నా రుణం మాఫీ అవుతుందో.. లేదో.. తెలియడం లేదు.

**–బాదావత్ శారద, మహిళా రైతు, తూర్పుగూడెం, టేకులపల్లి మండలం**

### అర్హతలున్నా.. మాఫీ కాలేదు..



నాకు అన్ని అర్హతలున్నాయి.. అయినా రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షల వరకు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తారనే ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాం. కొందరికి మాత్రమే మాఫీ చేసి.. మరికొందరికి చేయలేదు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే.. రేపు, మాపు అంటూ దాటవేస్తున్నారు. రుణమాఫీ కాకపోయినా రైతుబంధు ఇస్తారని ఆశ పడ్డాం. అది కూడా రాలేదు. పంట పెట్టుబడులకు మళ్లీ అప్పు చేయాల్సి వచ్చింది. మళ్లీ జాబితాలో నా పేరు ఉంటుందో, లేదో అర్థం కావట్లేదు.

**– సోందె వెంకటేశ్వర్లు, రైతు, చిన్నవారిగూడెం, మణుగూరు మండలం**

### అప్పు కట్టినా మాఫీ చేయలేదు



నాకు ఏపీజీవీబీలో రూ.2.12 లక్షల రుణం ఉంది. రూ.2 లక్షలకు పైగా ఉన్న అప్పు కడితే రుణమాఫీ అవుతుందంటే నేను పైగా మొత్తం అప్పు బ్యాంకులో కట్టేశాను. ప్రస్తుతానికి రూ.2 లక్షల లోపే బ్యాంకులో అప్పు ఉంది. అయినా ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. మండలంలో నాలాంటి రైతులు ఎందరో ఉన్నారు. మా లాంటి వారి పరిస్థితి ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ఇచ్చిన మాట తప్పడం వల్ల సర్కార్‌పై రైతుల్లో వ్యతిరేకత వస్తున్నది. అర్హులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి.

**–నీరుడు లాజర్, కాంగ్రెస్ నాయకుడు, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం మండలం**

### జాబితాలో నా పేరు లేదు



రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. నేను బ్యాంకులో తీసుకున్న రూ.50 వేలు కూడా మాఫీ చేయలేదు. తొలి విడతలోనే మాఫీ అవుతుందని ఎంతో ఆశ పడ్డా. కానీ.. నాలుగు విడతల్లో విడదల చేసిన జాబితాలో నా పేరు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకపోవడంతో పంట పెట్టుబడులకు చాలా ఇబ్బందిగా ఉంది. నా రుణం మాఫీ అవుతుందో.. లేదో.. అధికారులు కూడా చెప్పడం లేదు.

**–పొన్నగంటి వీరన్న, రైతు, కమలాపురం, మణుగూరు మండలం**

# 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై కార్యాచరణ చేపట్టాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 4 : జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 135 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి సౌకర్యాలతో సిద్ధమయ్యాయని తెలిపారు. వీటిని పంపిణీ చేయడానికి అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నిరుపేదల ప్రాతిపదికన జాబితా సిద్ధం చేసి శనివారంలోపు అందించాలని ఆదేశించారు. ఖమ్మం అర్బన్‌లో పూర్తయిన 4 ఇళ్లను ట్రాన్స్‌జెండర్లకు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. అర్హుల జాబితా సిద్ధం కాని ఇళ్లు 470 వరకు ఉన్నాయని, వీటిలో స్వీకరించిన దరఖాస్తుల విచారణ పూర్తి చేసి జాబితాను రెండు వారాల్లో సమర్పించాలన్నారు. నిర్మాణం పూర్తయి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ఇళ్లు జిల్లాలో 635 ఉన్నాయని, వీటిలో కనీస సౌకర్యాల కల్పనకు కావాల్సిన నిధులకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. గ్రౌండింగ్ అయిన, పాక్షికంగా నిర్మాణాలు జరిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు 702 వరకు ఉన్నాయని, వీటిని పూర్తి చేయడానికి కూడా వివరాలు సమర్పించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధర్నా చౌక్ నుంచి ఖమ్మం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

# 14న జాతీయ లోక్ అదాలత్

### ఖమ్మం జిల్లా జడ్జి టి.రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్, డిసెంబర్ 4 : ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.రాజగోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ నెల 14న చేపట్టబోయే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పాత్రికేయుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సుప్రీం కోర్టు, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఖర్చు లేకుండా న్యాయసేవా సంస్థ సహకారంతో సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఇప్పటివరకు జిల్లాలోని వివిధ కోర్టుల్లో 6,277 కేసులను గుర్తించామని, ఇంకా కేసులను గుర్తించి గత లోక్ అదాలత్ కంటే ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, గవర్నమెంట్ ప్లీడర్ అయితం రవీందర్, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, జనార్దన్, మద్దినేని నాగేశ్వరరావు, బండారుపల్లి గంగాధర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


# ఉలిక్కిపడిన జనం

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భూకంపం
- 7 సెకండ్లపాటు కంపించిన భూమి
- ఇండ్ల నుంచి బయటకు పరుగులు పెట్టిన ప్రజలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్‌లోని ఓ ఇంట్లో భూకంపానికి సెల్ఫ్ పైనుంచి కిందపడిన బకెట్లు, సామగ్రి

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 4 : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బుధవారం భూకంపం సంభవించింది. ఉదయం 7:25 గంటల సమయంలో పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఈ హఠాత్ పరిణామంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. ఇండ్ల లోంచి బయటకు పరుగులు తీశారు. ఖమ్మం జిల్లాలో సుమారు 30 ఏండ్ల తరువాత హఠాత్తుగా భూకంపం సంభవించడంతో ఆందోళన కలిగిస్తున్నది. 7 సెకన్లపాటు భూమి కంపించినట్లు ఖమ్మంజిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నది. ఉదయాన్నే వివిధ పనుల్లో నిమగ్నమైన ప్రజలు ఒక్కసారిగా భూమి కంపించడంతో ఏమి జరుగుతుందో తెలియని స్థితిలో ఉండిపోయారు. ఇండ్లలో ఉన్న వంట సామగ్రి కిందపడిపోవడం, మంచాలు ఊగడం, సామానులు కిందపడడంతో భయానికి గురయ్యారు. ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో భూమి కంపించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చాలా చోట్ల ఇండ్లలో వంట సామాన్లు పై నుంచి కింద పడిపోయాయి. కొంతమంది ఇళ్ల గోడలకు పగుళ్లు వచ్చాయి. భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం పరిధిలోని అన్ని మండలాల్లో భూమి కంపించింది. సింగరేణి ప్రాంతం కావడంతో ఎక్కువ ప్రమాదం ఇక్కడే పొంచి ఉందని జనం భయపడిపోతున్నారు.






కొత్తగూడెంలోని సంజయ్ నగర్‌లో ఓ ఇంట్లో గోడకు వచ్చిన పగుళ్లు



ఖమ్మం నగరంలోని యూపీహెచ్ కాలనీలో రోడ్డుపైకి వచ్చిన స్థానికులు

# కలెక్టరేట్ ఎదుట 'ఆశ'ల ర్యాలీ, ధర్నా

### సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం : సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్‌రెడ్డి




భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

మామిళ్లగూడెం, డిసెంబర్ 4 : ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా వేతనాలు పెంచాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మోహన్‌రావు, పి.రమ్య, మంగమ్మ, నాగమణి, రాణి, రాధ, కళ్యాణి, జ్యోతి, కమల, విజయ తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట...

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 4 : తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట బైఠాయించి బుధవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్‌లు మాట్లాడారు. ఆశ వర్కర్లకు రూ.18 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, లెప్రసీ, పల్స్ పోలియో సర్వేల పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, ధనలక్ష్మి, జయ, రుక్మిణి, విజయ, సుశీల, భాగ్య, చంద్రకళ, కిరణ్మయి, హైమావతి, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.